క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల చేయూత ప్రశంసనీయం



చిలకలూరిపేట: చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేయూతనందించటం ప్రశంసనీయమని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం యడవల్లి హనుమంతరావు చెప్పారు. పసుమర్రులోని జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల సంఘం తరుపున రూ.17,500 విలువ చేసే పోర్టబుల్ మైక్‌సెట్, విద్యార్థులు ఆంగ్ల చేతిరాత మెరుగుపరుచుకునేందుకు సంబంధించి రూ.14 వేలు విలువ చేసే 300 హ్యాండ్ రైటింగ్ పుస్తకాలు సోమవారం పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థులు అండగా నిలవడం అభినందనీయమన్నారు. గతంలోనూ పూర్వ విద్యార్థుల సంఘం తరుపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కోటా సుదర్శనరావు, వైస్ చైర్మన్ షేక్ గౌసియా, ఉపాధ్యాయులు శివకుమార్, ఎండీ యాసిన్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి




నరసరావుపేట ఈస్ట్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి గాంధీ పార్కు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా వేలాది మంది అసువులు బాయటంతో పాటు లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా భారతదేశం ఐక్యరాజ్యసమితిలో గళం విప్పాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ వరప్రసాదు, జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఎం నాయకులు డి.శివకుమారి, షేక్.సిలార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా ఇద్దరికి తీవ్రగాయాలు



రొంపిచర్ల: మండలంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చెక్ పోస్టు సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. దాచేపల్లి నుండి సున్నపు లోడ్‌తో చెన్నైకి వెళ్తున్న లారీ రొంపిచర్ల మార్కెట్ యార్డు సమీపంలోకి రాగానే బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన డ్రైవర్, క్లీనర్‌లను 108 అంబులెన్స్‌లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లటంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు



సతీష్ (ఫైల్)

శావల్యాపురం: ఈత సరదా యువకుడు ప్రాణాలు తీసిన సంఘటన మండలంలోని గంటా వారిపాలెం గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు వినుకొండ రూరల్ నాగిరెడ్డిపల్లెకు చెందిన ఇరువురు యువకులు కవలకుంట సతీష్ (23) పెద్దేటి సుందరరాజు అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు బైకుపై వచ్చారు. ఈక్రమంలో ఈత కొట్టాలని కాల్వలోకి దిగిన సతీష్ ఒక్కసారిగా నీటి ప్రవాహం ధాటికి గల్లంతయ్యాడు. విషయం గ్రహించిన సుందరరాజు కేకలు వేస్తుండగా చుట్టుపక్కల వారు గమనించి తాళ్ళతో కాపాడటానికి చేసిన ప్రయత్నాలు వృథా అయినట్లు బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని సతీష్ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. సుందరరాజు ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు. దసరా సెలవులు నిమిత్తం ఇంటికి వచ్చి సరదాగా గడుపుదామని సంతోషంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా కాల్వ రూపంలో మృత్యువు రావటంతో కుటుంబ సభ్యులు స్నేహితులు రోదనకు దిగారు.



వాసవీ మాత సేవలో.. 112 సంవత్సరాలు!!

ఆర్యవైశ్యుల కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు. సుమారు వంద సంవత్సరాలకు పైగా ఆ జగన్మాత సేవ చేస్తూ తరిస్తున్నారు వినుకొండ ఆర్యవైశ్య సోదరులు. వ్యాపార లావాదేవీల్లో ఎంత ఒత్తిడి ఉన్నా అమ్మసేవకు మాత్రం వారంతా ముందుంటారు. దాదాపుగా అమ్మవారి ఆలయం ఆరంభమైన నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకొక అవతారంలో జగదంబ భక్తులకు దర్శనమిస్తారు.



1944 లో దేవాలయం పునఃనిర్మాణం శిలాఫలకం

- వినుకొండలో 1912లో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణం
- 1944లో ఆలయ పునఃనిర్మాణం
- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్విరామంగా దసరా నవరాత్రులు నిర్వహణ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. దాదాపుగా 112 సంవత్సరాల క్రితం స్థాపితమైన ఈ అమ్మవారి దేవాలయం దినదిన ప్రవర్ధమానమై భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతోంది. ప్రధానంగా అమ్మకు శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా... ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

1912వ సంవత్సరంలో...

పట్టణంలో 1912 సంవత్సరంలో దక్షిణ బజారులో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం నిర్మించారు. తొలుత చిన్నపాటి ఆలయం ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించేవారు. అనంతర కాలంలో 1944లో అమ్మవారి దేవాలయం పునఃనిర్మాణం చేశారు. రానురాను దేవాలయ కమిటీ ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ విస్తరింపచేసింది.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవాలయ ఆవరణలో నూతనంగా కల్యాణ మండపం నిర్మించారు. అమ్మవారి దేవాలయంలో నవగ్రహాలు, శివలింగం ప్రతిష్ఠించారు. ఇక్కడ ప్రతిరోజూ అభిషేకాలు, అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. అలాగే ప్రతిఏటా వాసవీ మాత జన్మదినం, శ్రావణమాసం పూజలతో పాటు విశేష పర్వదినాల్లో పూజా కార్యక్రమాలు ఆలయంలో నిర్వహిస్తారు. భక్తులు సంఖ్య పెరగటంతో దేవాలయాన్ని విస్తరించి మరింత అనువుగా మలిచారు.



సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళలు (ఫైల్)

112 ఏళ్లుగా దసరా ఉత్సవాలు

దేవాలయం నిర్మాణం జరిగినప్పటి నుంచి ప్రతిఏటా దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించడంతోపాటు 9 రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, తీర్థప్రసాదాల వినియోగం, సామూహిక కుంకుమ పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ దేవాలయ పేరు ప్రతిష్ఠలు విస్తరింపజేశారు.



పురాతనమైన వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయం

భక్తుల కొంగుబంగారం



వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 30 ఏళ్లుగా పూజారిగా సేవలు అందిస్తున్నా. పురాతన దేవాలయాల్లో వినుకొండ అమ్మవారి దేవాలయం ఒకటి. 112 ఏళ్ల నుంచి అమ్మవారి దేవాలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం విశేషం. ప్రతిఏటా వినూత్న తరహాలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భక్తుల కొంగుబంగారం మా అమ్మవారు.

-నారాయణ, ఆలయ పూజారి

మరింత అభివృద్ధి చేస్తాం



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవాలయం అంచెలంచెలుగా అభివృద్ధి జరిగింది. భక్తుల సౌకర్యార్థం దేవాలయ విస్తరణ పనుల్లో భాగంగా వెనుక వైపు కల్యాణ మండపం నిర్మించాం. దాతల సహాయ సహకారాలతో దేవాలయం అభివృద్ధి కొనసాగుతోంది. రానున్న రోజుల్లో దేవాలయం అభివృద్ధి కృషి చేస్తాం.

- పెనుగొండ రమేష్, ప్రధాన కార్యదర్శి, ఆర్యవైశ్య సంఘం

వినుకొండలో వైభవంగా నగరోత్సవం



పట్టణంలో జల కలశాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న మహిళలు



వితంరాజుపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హిమాలయ గురూజీ

- 54 జల కలశాలతో తరలివచ్చిన మహిళలు
- వైభవంగా లక్ష కుంకుమార్చన, అభిషేకాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 5వ రోజు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 54 జల కలశాలతో మహిళలచే నగరోత్సవం, దంపతులచే మహన్యాసం, ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. వెయ్యి మంది మహిళలచే విశేషంగా లక్ష కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు మహాచండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం వినుకొండ పాలక మండలి సభ్యులు మిత్తింటి కృష్ణాంజనేయులు, నేరెళ్ల వెంకట పాపారావు, పెనుగొండ రమేష్, పెండేల శ్రీనివాసరావు, కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, కోట వెంకట ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వితంరాజుపల్లిలోని చిన్నషిరిడీలో...

వినుకొండ మండలంలోని వితంరాజుపల్లిలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖండ జ్యోతి ప్రదాత శ్రీ హిమాలయ గురువు దివ్య ఆశీస్సులతో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు రాజశ్యామల యాగం, గురూజీ చేతుల మీదుగా ప్రతి రోజూ కుంకుమ పూజ జరుగును. సర్వలోక కళ్యాణం కోసం హిమాలయ గురువు మౌన దీక్షలో ఉంటారని తెలిపారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యాహ వాచనం, నవగ్రహ మండపారాధన, యోగిని మండపారాధన, 108 శ్రీ చక్ర కలశ స్థాపన అమ్మవారి విగ్రహ స్థాపన తదితరు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, పెండేల మోహన్‌రావు, పెండేల పుల్లారావు, కాశీ, సుధాకర్, రమేష్, మునిరెడ్డి, సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచిది

ప్రతి ఒక్కరూ కొనుగోలుచేసి రైతులను ప్రోత్సహించాలన్న డీపీఎం అమలకుమారి



స్టాల్‌లో సొరకాయను ప్రదర్శిస్తున్న డీపీఎం అమలకుమారి, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్

నరసరావుపేట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతో రుచికరంగా, ఆరోగ్యానికి ఎంతో మేలు కారంకంగా ఉంటాయని ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీయం అమలకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఆఫీస్ దగ్గర జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిని డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ సందర్శించారు. అమలకుమారి మాట్లాడుతూ అనేక రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు స్టాల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. మహిళా మార్ట్, రైతుబజార్‌లలో ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉంటున్నాయని అన్నారు. ప్రజలందరూ ఈ చక్కని అవకాశాన్ని ఉపయోగించుకొని మంచి ఆహారం తిని ఆరోగ్యం, ఆనందాన్ని పొందాలని కోరారు. అలాగే రైతులు కూడా ఈ విధంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అందరికీ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందజేయడానికి ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు. వీటిని పండించే రైతులను ప్రోత్సహించేందుకు ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ప్రజలను కోరారు.

ప్రజాదర్బార్‌లో స్వయంగా పాల్గొంటా

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



యడ్లపాడు ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రతినెలా ఒక వారం తాను స్వయంగా పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుంటానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ సమస్యలపై 70 అర్జీలు అందాయి. వీటిల్లో ముఖ్యంగా 34 అర్జీలు రెవిన్యూ అంశాలు కాగా, మరో 36 అర్జీలు ఇతర శాఖలకు చెందినవి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వారం వారం మండల కేంద్రాల్లో ప్రజాదర్బార్ కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీవో హేమలతాదేవి, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్‌హుస్సేన్, ఏవో సరిత, ఎంపీపీ దయాసాగర్, ఎంపీటీసీ శ్రీనివాస రెడ్డి, మండల పార్టీఅధ్యక్షుడు కామినేని సాయిబాబు, నాయకులు పాల్గొన్నారు. అలాగే వంకాయలపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.

నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించండి

మహిళ పోలీసులకు డీఎస్పీ కె. నాగేశ్వరరావు సూచన



మాట్లాడుతున్న డీఎస్పీ కె. నాగేశ్వరరావు

నరసరావుపేటటౌన్: నేరాల నియంత్రణలో మహిళ పోలీసుల పాత్ర కీలకం కావాలని డీఎస్పీ కె. నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళ పోలీసులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి వారు విధులు నిర్వహించే ప్రాంతంలో మహిళలను చైతన్య పరచాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ధైర్యంగా మహిళలు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేలా వారిలో అవగాహన పెంపొందించాలన్నారు. భార్య, భర్తల మధ్య చిన్నపాటి వివాదాలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ స్టేషన్ దాకా రాకుండా ఇళ్ల వద్దే వారిని కౌన్సిలింగ్ చేయాలన్నారు. గృహ యజమానులు ఇంటికి తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అటువంటి ఇళ్లపై నిఘా ఉంచాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే వారి సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలని కోరారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటా యని ముందస్తు సమాచారం ఉంటే అధికారులకు తెలియపరచాలన్నారు. బాల్య వివాహాలపై దృష్టి సారించి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు విజయ్‌చరణ్, హైమారావు, ట్రాఫిక్ సీఐ లోక్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ పరిపాలన తెలుసుకోవాలి

క్రోసూరు: స్థానిక ప్రజా ప్రతినిధులు పంచాయతీల సాధారణ పరిపాలన తెలుసుకుని ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ హాలులో సోమవారం ఉప సర్పంచ్‌కు, ఇద్దరు వార్డు సభ్యులు(ఒక మహిళ, ఒక పురుషుడు)కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. తొలిరోజు కోర్సు డైరెక్టర్, ఎంపీడీఓ బి.మహేష్‌బాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, దొడ్లేరు పంచాయతీ కార్యదర్శి వెంకయ్య పాల్గొన్నారు. ముందుగా జాతిపిత గాంధీజీ, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గ్రామసభల ఉద్దేశాలు, బై లా తయారుచేయడం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 18 పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

• వైభవంగా కొనసాగుతున్న దసరా ఉత్సవాలు



నరసరావుపేటలో వైష్ణవీ దేవిగా...



లింగారావుపాలెంలో అన్నపూర్ణాదేవిగా..



రవ్వవరంలో లలితాదేవిగా..



గణపవరంలో చండికాదేవిగా..



శావల్యాపురంలో శ్రీమహాచండీ దేవిగా..



నరసరావుపేటలో మహేశ్వరీ దేవిగా...

బాధ్యతలు చేపట్టిన వీఆర్వోలు

శావల్యాపురం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన నూతన వీఆర్వోలు సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దారు వేముల వెంకట నాగరాజు తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని కొత్తలూరు గ్రామపంచాయతీ వీఆర్వోగా ఉప్పలూరి చిన మంగయ్య, శానంపూడి గ్రామ పంచాయతీ వీఆర్వోగా మల్లెల రాధ, కనమర్లపూడి గ్రామపంచాయతీ వీఆర్వోగా కె.నరసింగరావు, శావల్యాపురం గ్రామపంచాయతీ వీఆర్వోగా డి.రమాదేవిలు బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పిచికలపాలెం, గుంటుపాలెం, మతుకుమల్లి, పోట్లూరు గ్రామపంచాయతీలకు నూతన వీఆర్వోలు నియామకం ప్రభుత్వం చేయాల్సి ఉందన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా మురళి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా మురళీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మురళీ గతంలో వినుకొండ తహసీల్దార్‌కార్యాలయంలో ఆర్ఐగా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. మాచర్లలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా వినుకొండకు వచ్చారు. డీటీగా బాధ్యతలు చేపట్టిన మురళిని కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

చౌక బియ్యం పట్టివేత

చిలకలూరిపేట: అక్రమంగా తరలిస్తున్న చౌకబియ్యాన్ని పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టణ ఎస్ఐ డి.చెన్నకేశవులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌకబియ్యం తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు పట్టణంలోని వేలూరు రోడ్డులో దాడి చేసి మినీ లారీలో తరలిస్తున్న చౌకబియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించి వాహనంలో ఉన్న మొత్తం 78 బస్తాల్లో నిల్వ చేసిన 39 క్వింటాళ్ల బియ్యాన్ని సీఎస్‌డీటీ లక్ష్మణరావుకు స్వాధీనం చేశారు. వాహన డ్రైవర్ పురుషోత్తమ్‌తో పాటు మరో వ్యక్తి టి.శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు.

శిక్షణ తరగతులు

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు,వార్డు సభ్యులకు పంచాయతీ పరిపాలన విధానంపై రెండు రోజుల శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ముంద్రు మనోహార్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు

శావల్యాపురం: మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ శావల్యాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బోడ్డు యాకోబు, కారుమంచి గ్రామపంచాయతీ కార్యదర్శిగా మిరియాల జ్యోత్సరాణి, వయ్యకల్లు గ్రామపంచాయతీ కార్యదర్శిగా సైదారెడ్డిలు బాధ్యతలు స్వీకరించారన్నారు.నూతన పంచాయతీ కార్యర్శులుగా బాధ్యతలు స్వీకరించిన వారందరు అంకిత భావంతో పారదర్శకంగా తమ విధులు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పరంగా మెరుగైన సేవలు సకాలంలో అందించాలన్నారు.

ఘనంగా చండీ హోమం

పెదకూరపాడు: 75 తాళ్లూరులో సోమవారం చండీ హోమం నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఐదోరోజు అమ్మవారిని చండీ దేవిగా అలంకరించారు. 13 అనువాకాలతో హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. సాయి సుబ్రహ్మణ్య రాఘవశర్మ, బసవరాజు సుబ్రమణ్య శర్మ హోమం క్రతువు నిర్వహించారు. ఆలయ పూజారులు హనుమంతరావు శర్మ, హరినాథ శర్మ భక్తులకు చండీ విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ శివసాయి ట్రస్టు సభ్యులు నిర్వహణలో అన్నప్రసాద వితరణ చేశారు.

ఆరోగ్య విస్తరణాధికారికి సన్మానం

క్రోసూరు: వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాల్లో 34 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్‌ను క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరిచందన, డాక్టర్ మహమ్మద్ సాద్, డాక్టర్ ధనుష్ శాంసన్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి ఎన్నో ఉద్యోగోన్నతులు పొందిన శ్యాంసన్ వృత్తిపట్ల అంకిత భావం పనిచేశారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చిరపరిచితుడు, మంచి పేరు తెచ్చుకున్నవాడని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, ఆరోగ్యపరివేక్షకురాలు అమర జ్యోతి, స్టాఫ్ నర్స్ అంజమ్మ, వీరయ్య ఫార్మసిస్ట్ ఫాతిమా బేగం ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.